

వ్యాధుల కాలం.. జీవాలు భద్రం
రాకతో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. - 8లో



ఉత్సాహంగా బధిరుల క్రికెట్
కడప నగరంలోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానం వేదికగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బధిరుల జట్ల మధ్య ఆదివారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. - 8లో

గరిష్టం/కనిష్టం
35.2 /25.4

వాతావరణం
జిల్లాలో సోమవారం 25.4 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

లక్ష్యానికి మించి ఉపాధి

- జాతీయ ఉపాధిహామీ పనుల కల్పనలో జిల్లాకు రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- 106.71 శాతంగా నమోదు
- ఇంతవరకు వేతనాలకు ఖర్చు చేసిన మొత్తం రూ. 106.21 కోట్లు
- నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కడప సిటీ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా కూలీలకు ఉపాధి దొరుకుతోంది. వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన జాబ్ కార్డు ఉన్న కూలీలు ఉపాధి పనులపై మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు కనీస వేతనం కూడా రూ. 272 నుంచి రూ. 300కు ప్రభుత్వం పెంపు చేయడంతో పనులకు ఆసక్తిగా వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది. ఈ సారి రూ. 400 కోట్ల బడ్జెట్‌ను వేతన జీవులకు, నిర్మాణాత్మక పనులకు కేటాయించారు.

48,02,827 లక్షల పనిదినాల కల్పన

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం కల్పతరువుగా మారుతోంది. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పనులు సమీప గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు కల్పిస్తున్నారు. వేసవి అయినందువల్ల చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. దీంతో పనులు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ఆర్థిక సంవత్సరం పనులు ప్రారంభం కాగా, మొత్తం 80 లక్షల పనిదినాలు చేయాలని, ఇందుకోసం కూలీల వేతన ఖర్చులకు రూ. 240 కోట్లు వెచ్చించాల్సింది లక్ష్యం. ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు 45 లక్షల పనిదినాలు చేయాల్సి ఉండగా, 48,02,827 లక్షల పనిదినాలు నమోదయ్యాయి. ఇందుకోసం ఇప్పటివరకు రూ. 106.21 కోట్లు వేతనాలకు ఖర్చు చేశారు. పనుల శాతం 106.21 శాతంగా నమోదైంది. ప్రస్తుతం రోజుకు 60 వేలకు పైగా పనులకు కూలీలు హాజరవుతున్నారు. వేతనాలు కూడా సకాలంలో కూలీలకు అందడం వల్ల పనులకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధి హామి పనుల్లో జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. గతంలో ఐదోస్థానంలో ఉండగా, పనుల జోరుతో ఈ స్థానానికి చేరుకుంది.

వేతన పెంపుతో పెరిగిన కూలీల హాజరు

ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధిహామీ పథకంలో కూలీలకు మరింత ఊతమిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలకు కనీస వేతనాన్ని పెంచి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడింది. గత సంవత్సరంలో రూ. 272 ఉన్న సగటు వేతనం ప్రస్తుతం ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ సంఖ్య రూ. 300కు చేరింది.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

ప్రధానంగా ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫారం పాండ్స్, డకౌట్ పాండ్స్, చెరువుల పునరుద్ధరణ, ప్లాంటేషన్, కాలువల్లో పూడికతీత తదితర నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నిర్మాణాత్మక పనులకు సంబంధించి గ్రామ సచివాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర పనులను చేపడుతున్నారు.



పనుల వద్ద వసతుల కల్పన

ఉపాధి కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉపాధి యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఎండ తీవ్రత నేపథ్యంలో వేకువజామునే పనులకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. తిరిగి ఎండ తీవ్రత అధికం కాకముందే ఇంటికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇబ్బందులు లేకుండా పీహెచ్‌సీ నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకు వెళ్లేందుకు అవకాశం కూడా కల్పించారు. సేద తీరేందుకు గుడారాలు, ప్రథమ చికిత్స పెట్టెలను కూడా అందుబాటులో ఉంచడం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

జాబ్‌కార్డులు, కూలీలు, పనిదినాలకు సంబంధించిన వివరాలు	
జారీ చేసిన జాబ్‌కార్డులు	221365
జాబ్‌కార్డుల్లో ఉన్న కూలీలు	401946
యాక్టివ్ జాబ్‌కార్డులు	189733
యాక్టివ్‌లో ఉన్న కూలీలు	321221
పనికి హాజరైన కుటుంబాలు	132027
పనికి హాజరైన కూలీలు	206683
పనిదినాల లక్ష్యం	45 లక్షలు
నమోదైన పనిదినాల సంఖ్య	4802827
సాధించిన శాతం	106.73
వేతనాల కోసం చేసిన ఖర్చు	రూ. 106.21 కోట్లు
మెటీరియల్‌కు చేసిన ఖర్చు	రూ. 1.99 కోట్లు
పనులకు హాజరవుతున్న కూలీలు	60 వేల మంది
కూలీల వేతనానికి బడ్జెట్	రూ. 240 కోట్లు
నిర్మాణాత్మక పనులకు బడ్జెట్	రూ. 160 కోట్లు
ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్	రూ. 400 కోట్లు

ఒంటెనే చోరీ చేశారు

- అంగళ్లులో జరిగిన ఘటన
- ఆచూకీ చెబితే పారితోషికం



కురబలకోట : ఇన్నాళ్లు పర్సులు కొట్టేసే దొంగలను చూశాం.. ఇంట్లో చొరబడి బంగారో..నగదో చోరీ చేసిన వాళ్లనూ చూశాం.. కానీ ఏకంగా పెద్ద జంతువులలో ఒకటైన ఒంటెనే ఎత్తుకెళ్లే ఘనులుంటారని ఇప్పుడే చూస్తున్నాం. అవును.. అన్నమయ్య జిల్లా కురబల కోట మండలం అంగళ్లులో ఒంటెను ఎత్తుకెళ్లిన ఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు..త్వరలో జరగబోయే బక్రీద్‌కు అంగళ్లుకు చెందిన మిత్రులు కొందరు 13 రోజుల క్రితం రూ.1.25 లక్షలతో ఒంటెను కొన్నారు. పరిసర ప్రాంతాల్లో మేపుతూ రాత్రి వేళ ఇంటి వద్ద కట్టేసేవారు. ఆదివారం వేకువ జామున లేచి చూస్తే ఒంటె కాస్తా కన్పించలేదు. తాడు తెంపుకుని బయటకు వెళ్లిందోమోనని తొలుత భావించారు. స్థానికంగా వెతికినా కన్పించలేదు. ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకే కాకుండా రాత్రి పొద్దుపోయే వరకు కూడా స్నేహితులు కలిసి అంతటా గాలించారు. పరిసర ప్రాంతాలు జల్లెడ పట్టినంత పనిచేశారు. సమీపంలోని గుట్టలు, వాగులు, వంకలతో పాటు పరివాహక ప్రాంతాల్లో కూడా వెతికారు. ఎక్కడా ఆచూకీ కన్పించలేదు. గుర్తు తెలియని వారు ఎవరైనా తోలుకెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కూడా పరిశీలించారు. ఒంటె జాడ మాత్రం కన్పించలేదు. అంగళ్లు సమీపంలోని కనసానివారిపల్లె నుంచి మదనపల్లెకు కొత్తగా వేస్తున్న బైపాస్ మీదుగా ఒంటెను తోలుకెళ్లిన ఆనవాళ్లు, అడుగులు కన్పించినట్లు చెబుతున్నారు. సాధారణంగా ఏనుగులు, ఒంటెలు లాంటి భారీ సైజు వాటిని చోరీ చేయడం ఆషామాషీ కాదు. కష్టంతో పాటు సాహసంతో కూడుకున్న పని. ఇలాంటి పెద్ద ఒంటెనే అంగళ్లులో ఏకంగా చోరీ చేశారంటే వారెంత ఘనులో అర్థం చేసుకోవచ్చు. ఆచూకీ తెలిస్తే 8978126623 మొబైల్ నెంబరుకు సమాచారం ఇస్తే తగిన పారితోషికం ఇస్తామని బాధితులు తెలిపారు.

న్యూస్‌రీల్

జెడ్పీ అకౌంట్ స్లిప్స్‌పై అభ్యంతరాలకు ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : 2022-23 సంవత్సరపు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ సాంవత్సరిక పట్టికలను (అకౌంట్ స్లిప్పులు) ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేసే ప్రావిడెంట్ ఫండ్ చందాదారులు ఆన్‌లైన్‌లో ఉంచిన అకౌంట్ స్లిప్పులను సరిచూసుకోవాలన్నారు. అందులో నమోదు చేసిన మొత్తాలకు సంబంధించి ఏదైనా అభ్యంతరముంటే అందుకు కారణాలు, తగు రుజువులతో జిల్లా పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. నెలలోపు అందిన అభ్యంతరాలను మాత్రమే సవరిస్తామని చెప్పారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కడప స్పోర్ట్స్ : ఏపీ యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు కేంద్రం ప్రభుత్వం ప్రదానం చేసే 'పద్మ' అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాల కోసం సామాజిక సేవారంగంలో విశేష సేవలు అందించి, అర్హత కలిగిన వారు అవార్డ్స్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలను జులై 15వ తేదీలోగా పోస్టు ద్వారా కానీ, నేరుగా కానీ స్టెప్ కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాలకు స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు 9949298810, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ 9849497045 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఏపీ పీజీసెట్-2024 ప్రారంభం

వైవీయూ : రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పీజీసెట్-2024 సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు మూడో సెషన్‌గా కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించారు. కడపలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షను అబ్జర్వర్‌గా విచ్చేసిన వైవీయూ సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాసగౌడ్ పర్యవేక్షించారు. కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఒక సెషన్ పరీక్ష నిర్వహించారు. తొలిరోజు ఇంగ్లీషు,పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, జువాలజీ, ఎలక్ట్రానిక్స్, తెలుగు, తదితర కోర్సుల్లో పరీక్ష నిర్వహించారు. వైవీయూ పరిధిలో తొలిరోజు 345 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పీజీసెట్ ఈనెల 13వ తేదీ వరకు జరగనుంది.

వీరభద్రస్వామికి వైభవంగా పల్లకి సేవ



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకి సేవ చేశారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అలాగే స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. అలాగే నిత్యాన్న కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

డి ఫార్మసీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ విద్యలో భాగంగా ఉన్న డిప్లమా ఇన్ ఫార్మసీ (డీ ఫార్మసీ) కోర్సు ప్రవేశానికి ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. అభ్యర్థులు https:// apsbtet.in/pharmacy వెబ్‌సైట్‌లో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ రెగ్యులర్‌తోపాటు దూర విద్య ద్వారా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంటర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయించి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలను కల్పిస్తామని చెప్పారు. వివరాలకు 964063707, 9440144057 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

8మంది సీఐలు, ఆరుగురు ఎస్ఐల బదిలీ

కడప అర్బన్ : జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో సీఐలుగా, ఎస్ఐలుగా పనిచేస్తున్న అధికారులు విజయవాడకు బందోబస్తు విధుల కోసం వెళ్లారు. వారు విధులకు వెళ్లిన సమయంలో ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 8 మంది ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు ఎస్ఐలను తాత్కాలికంగా నియమిస్తూ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం పనిచేస్తోంది	తాత్కాలిక బదిలీ
వి. శ్రీధర్‌నాయుడు	సీఐ	సైబర్ క్రైం, కడప	పెండ్లిమర్రి పీఎస్
ఏ. మధు మల్లేశ్వర్‌రెడ్డి	సీఐ	ఎహెచ్‌టీయూ, కడప	వీఎన్‌పల్లె పీఎస్
ఎం. వెంకటేశ్వర్లు	సీఐ	పీసీఆర్,కడప	వల్లూరు పీఎస్
జె. శివశంకర్	సీఐ	వీఆర్,కడప	తొండూరు పీఎస్
ఏ, మోహన్‌కుమార్	సీఐ	వీఆర్, కడప	లింగాల పీఎస్
టి. నారాయణ యాదవ్	సీఐ	ఆర్ఎస్ఏఎస్‌టిఎఫ్	చక్రాయపేట పీఎస్
ఎం. రామభూపాల్	సీఐ	సీసీఎస్, కడప	రాజుపాళెం పీఎస్
సి. దేవకిరణ్‌కుమార్	సీఐ	సోషల్ మీడియా,సైబర్‌క్రైం	దువ్వూరు పీఎస్
డి.సిహెచ్.పుల్లయ్య	ఎస్ఐ	డీటీసీ, కడప	గోపవరం పీఎస్
సీహెచ్ వెంకటరమణ	ఎస్ఐ	సీసీఎస్, కడప	అట్లూరు ఎస్ఐ
జి. మల్లికార్జున	ఎస్ఐ	ఫ్యాక్షన్‌జోన్,కడప	ఎస్.ఎ. కాశినాయన
కె. నజీర్‌హుసేన్	ఎస్ఐ	కడప ట్రాఫిక్	తలమంచిపట్నం
ఎం. రాజారెడ్డి	ఎస్ఐ	డీసీఆర్‌బీ, కడప	మైలవరం. పీఎస్
కె. నారాయణ స్వామి	ఎస్ఐ	పీసీఆర్, ప్రొద్దుటూరు	కలమల్ల పీఎస్

మాతాశిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



బద్వేలు : విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జాతీయ బృందం

బద్వేలు అర్బన్ : తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీలో గల విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను సోమవారం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు సంబంధించిన నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. బృందంలోని సభ్యులు డాక్టర్ మితిలీష్‌చంద్రసూరి, డాక్టర్ రాఘవేంద్రరావులు మాతాశిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాల పంపిణీ, హెల్త్‌క్లినిక్ నిర్వహణ, మందుల పంపిణీ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతాశిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, మాతాశిశు మరణాలు లేకుండా చూడాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ ప్రభావతి, శుభలేఖ, రాధ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఏఎన్ఎంలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్‌క్లినిక్ తనిఖీ

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభలవీడు విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను సోమవారం ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) టీమ్ డాక్టర్ మినీమోల్ (కేరళ), డాక్టర్ కృష్ణప్రసాద్ (తమిళనాడు)లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందుతున్నాయా, బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేస్తున్నారా, పరీక్షల అనంతరం మందులు అందుతున్నాయా, విలేజ్ హెల్త్‌క్లినిక్ ప్రాధాన్యత తదితర అంశాల గురించి ఆరా తీశారు. వైద్య సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పరిశుభ్రత, దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుఆర్‌రాజు, డాక్టర్ ఉదయ్ కిరణ్, సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్ విలియం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు వాన కురిసింది. మైదుకూరులో అత్యధికంగా 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కలసపాడులో 15.4, బిమఠంలో 11.8, ఖాజీపేటలో 11.4, కాశినాయనలో 10.8, ఎర్రగుంట్లలో 9.8, సింహాద్రిపురంలో 8.8, చెన్నూరులో 8.6, కమలాపురంలో 8.6, బద్వేల్‌లో 6.5, పోపాడులో 5.6, ముద్దనూరులో 5.2, పెద్దముడియం, దువ్వూరులో 4.2, రాజాపాలెంలో 4, సీకే దిన్నె 3.4 , వల్లూరులో 2.6, కడపలో 2.4, చక్రాయపేటలో 2, పోరుమామిళ్లలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోషకాల్లో అల్ల నేరేడు!

- సీజన్‌లోనే లభ్యం
- ఆరోగ్యప్రదాయినిగా గుర్తింపు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- మార్కెట్‌లో కిలో రూ.150 నుంచి రూ.200



నేరేడు పండ్లు

రాజంపేట/కడప కోటిరెడ్డి సర్కిల్ : నేరేడు పండ్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. జూన్, జూలై నెలలో మాత్రమే లభించే ఈ పండ్లు, ఆరోగ్యప్రదాయినిగా గుర్తింపు పొందాయి. సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతోపాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తాయి.

రుచిలో మేటి..

రుచిలో మేటిగా ఉండటమే కాకుండా ఆకులు, చెట్లు, బెరడు కూడా శరీరానికి మేలు చేస్తాయి. ఈ పండ్లను ఉభయ వైఎస్సార్ జిల్లాలో పాటు మహారాష్ట్ర, మదనపల్లె తదితర ప్రాంతల నుంచి వ్యాపారులు ఎగుమతి చేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు. కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు తదితర పట్టణాల్లో తోపుడుబండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో వీటి ధర కిలో రూ.150 నుంచి రూ.200ల వరకు ఉంది.

అత్యధికపోషకాలు..

అత్యధిక పోషకాలు, ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్యసపానీయాలు, జామ్,ఐస్‌క్రీంలు తయారుచేసుకోవచ్చు. సాంప్రదాయ ఆయుర్వేద వైద్యవిధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడుపండు తింటే అనేక రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చునని వైద్యులు అంటున్నారు.

- ప్రొటీన్లు 7 శాతం, తేమ 88 శాతం, ఐరన్ 12 మిల్లీ గ్రాములు, విటమిన్-సి 18 మిల్లీ గ్రాములు, పాస్పరస్ 18 మిల్లీ గ్రాములు, క్యాల్షియం 15 మిల్లీ గ్రాములు, కొవ్వు 3 శాతం, ఖనిజం 4 శాతం, పీచు 3 శాతం, పిండి పదార్థం 14 శాతం ఉంటుంది.

రైతుల వద్ద దళారులు కిలో 100-150 వరకు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ. 200-250 వరకు విక్రయిస్తారు. వినియోగదారులచేతికి వచ్చేసరికి రూ. 400 ధర పలుకుతోంది.

నేరేడు..ప్రయోజనాలు

- ఐరన్ ,కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజన్‌ల వ్యాధులుబారీ నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్రసమస్యల నియంత్రణతోపాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. శుభ్రపరుస్తుంది.
- యాంటీ యాక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకుపోవడానికి నేరేడు దోహదపడుతుంది.
- విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళలలో ఆరోగ్యానికి నేరేడు పండు మేలు చేస్తుంది.

అతిగా..

- నేరేడు పండ్లను అతిగా తింటే దుష్ఫలితాలు ఉంటాయి. వగరు రుచి నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతునొప్పి సంభవిస్తుంది. సీజన్ మారే సమయంలో మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాలు వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

మంచిపోషకాలు

నేరేడు పండ్లలో మంచి పోషకాలు ఉన్నాయి. నీరు ప్రొటిన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్‌లు, విటమిన్‌లు, మినరల్స్ ఉంటాయి. వీటిని తగుమోతాదులో తీసుకోవాలి. షుగర్ వ్యాధి నియంత్రణకు ఎంతగానో దోహదపడాతాయి. వేసవికాలంలో వచ్చే సమస్యలకు మంచి పరిష్కారం ఉంటుంది. ప్రజలు సీజనల్‌గా వచ్చే పండ్లను మితంగా తీసుకోవాలి.
- డా.జీపీశివారెడ్డి, ప్రముఖ షుగర్ వ్యాధినిపుణులు, కడప

ఆరోగ్యానికి ఎంతో మేలు

నెరేడుపండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనిషిలోని పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. వీటిని నానబెట్టి నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. ఈ పండ్లలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ పండ్లు మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకుంటే రక్తం అదుపులో ఉంటుంది. ఇవి ఎర్ర రక్త కణాలను వృద్ధి చేస్తాయి. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు నిత్యం నెరేడు పండ్లు తినడం వల్ల రాళ్లు కరిగి మూత్రం ద్వారా బయటికి వస్తాయి.
- డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యులు, కడప

జంతువులను హింసిస్తే చర్యలు



పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఈ నెల 17వ తేదీ బక్రీద్ సందర్భంగా జంతువులను వధించినా లేక అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్థశాఖ అధికారి డాక్టర శారదమ్మ హెచ్చరించారు. సోమవారం ఇక్కడ ఆమె మాట్లాడుతూ జంతు సంరక్షణ కేంద్రాలను జిల్లాస్థాయిలో, గ్రామ పంచాయితీ స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. హైకోర్టు ఆదేశానుసారం కడప జిల్లా నోడల్ ఆఫీసర్లుగా డాక్టర్ రాజశేఖర్(9441614707), బాబునాయక్(9949298809)లను నియమించినట్లు తెలిపారు. గోవధ, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు 1978, 2001 స్లాటర్ హౌస్ రూల్స్ 2001పై చట్టాలు అమలయ్యే విధంగా చూడాలన్నారు.బక్రీద్ రోజున జిల్లాలోని ఉప సంచాలకులు జంతు సరంక్షణ చట్టాలను పాటిస్తూ అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న కడప జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రస్తుతం ఏర్పడబోయే ప్రభుత్వమైనా కృషి చేసి రాయలసీమ పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో కీలకమైన చంద్రబాబు సంకల్పిస్తే ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే అవకాశం ఉన్నదన్నారు. గతంలో ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా సమితి సభ్యుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు పదవికి మాసీమ బాబు రాజీనామా

కడప కార్పొరేషన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఆర్. వెంకట సుబ్బారెడ్డి(మాసీమ బాబు) ఆ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు టీటీడీ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు తన రాజీనామా లేఖను పంపించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇదివరకే రాజీనామా చేసిన నేపథ్యంలో అందులో సభ్యులైన మాసీమ బాబు కూడా రాజీనామా చేశారు.

వ్యాధుల కాలం.. జీవాలు భద్రం

- జీవాలకు వర్షాకాలంలో వ్యాధులు సోకే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు
- పశువైద్యుల సూచనలు పాటించాలి
- ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి


ఆకులనారాయణపల్లెలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కాశినాయన : నోరులేని మూగజీవాలను ఓ కంటి కనిపెడుతూనే ఉండాలి. వ్యవసాయ రంగంతో పాటు పాడిపశువులు, ఇతర జీవాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వర్షాకాలం రాకతో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకుతుంటాయి. ఆ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆయా వ్యాధుల బారి నుండి పశువులు, జీవాలకు ప్రాణహాని కలగకుండా చూసుకోవచ్చని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఆయా వ్యాధుల గురించి తెలుసుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటే పశువుల ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చని అంటున్నారు.

నోటిపుండ్ల లక్షణాలు..

మేకల్లో బ్లూటరింగ్ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు వాయడం, నోటిలోపల పుండ్లు, ముగ్గులో చీమిడి, కాళ్లు కుంటడం, ఒంట్లో నీరు చేరుకోవడం, పారుకోవడం, మేత మేయకపోవడం, చూడు పశువులు అయితే ఈసుకుపోవడం, 30 శాతం వరకు మరణాలు కలిగే విధంగా ఈ వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందకు వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడు బ్లూటాక్స్‌టిక్కెల్ మందులు పిచికారీ చేస్తూ పొడి ప్రదేశాల్లో మందను తోలుకోవాలి.

కాళ్లపుండ్ల వ్యాధి..

జీవాలకు కాళ్లపుండ్లవ్యాధి సోకితే కాలిగిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపించినప్పుడు జీవాలను బురద ప్రాంతాల్లో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేత చేసే విధంగా చూడాలని పశువైద్యులు చెబుతున్నారు.

గొంతువాపు వ్యాధి..

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ఒకటి. ఇది చాలా ప్రమాదకర వ్యాధి. ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వలన సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీటి ద్వారా, మేత ద్వారా పశువులకు సోకి రోగ నిరోధకశక్తి తగ్గడం వలన ఈ వ్యాధి బారిన పడతాయి. వ్యాధిబారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకే పాకలో మిగతా వాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే వర్షాకాలంలో పశువులు తడవకుండా చూసుకోవాలి. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.

చిటికవ్యాధి..

ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయస్సు గల గొర్రెల్లో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు తక్కువ సమయంలోనే మరణిస్తాయి. వ్యాధి సోకిన వెంటనే గొర్రెలు నీరసించి కొద్దిసేపటికే విలవిల కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో గొర్రెల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుండి వేరు చేయాలి.

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి



సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలి. లక్షణాలు తెలియకుంటే పశువులకు ఆయా వ్యాధులు సోకి మరణించే ప్రమాదముంది. ముందుగానే ఆయా వ్యాధులు రాకుండా టీకాలు వేయించుకోవాలి. వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం అందించాలి. వైద్యుల సూచనలు, సలహాలతో మందులు వాడితే ఆయా వ్యాధుల నుంచి పశువులను, గొర్రెలను సంరక్షించుకోవచ్చు. పశువులకు వ్యాధులు సోకినట్లు గుర్తిస్తే దగ్గరలోని పశువైద్యులను కలిసి వాటికి సకాలంలో వైద్యం అందిస్తే సంరక్షించుకోవచ్చు.

\- సి.రామారావు, పశువైద్యాధికారి, నరసాపురం

ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి


మాట్లాడుతున్న మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి అని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం 1988 ప్రకారం బీమా లేకుండా ఎలాంటి మోటారు వాహనాలను ఉపయోగించకూడదన్నారు. బీమా లేని వాహనాలను నడిపితే మూడు నెలల జైలు శిక్ష లేదా రూ. 2వేలు జరిమానా ఉంటుందన్నారు. తర్వాత పట్టుబడితే మూడు నెలల వరకు జైలు శిక్ష, రూ. 4 వేలు జరిమానా లేదా రెండు ఉంటాయన్నారు. కనుక వాహనదారులు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సులను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

వివాహిత అదృశ్యం

మదనపల్లె :పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మస్తాన్‌వలీ భార్య గులాబ్‌షా(28) ఈనెల 5వతేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మస్తాన్‌వలీ, తన భార్య అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నీట్ పరీక్ష 2024 నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున సమగ్ర విచారణ జరిపి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలో ఒకే సీరియల్ నంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బధిరుల క్రికెట్ మ్యాచ్


విన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న తెలంగాణ జట్టు


రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఆంధ్రా జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానం వేదికగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బధిరుల జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం నిర్వహించిన ఈ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు విజయం సాధించగా, ఆంధ్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త జె. ప్రదీప్, బధిరుల పాఠశాల నిర్వాహకుడు దౌలత్‌ఖాన్‌లు విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బధిరుల క్రికెట్ మ్యాచ్‌లో క్రీడాకారులందరూ చక్కటి క్రీడాస్ఫూర్తితో ఆడటం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో ఏపీ జట్టు కెప్టెన్ బిల్లా రాజు, తెలంగాణ జట్టు కెప్టెన్ రాజారాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రాయచోటి(అన్నమయ్య సర్కిల్) : రాయచోటి సబ్ జైలులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. రాయచోటి మండలం యండపల్లె గ్రామంలోని బోయపల్లెలో ఇటీవల జరిగిన ఘర్షణ సంఘటనలో 16 మందిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాయచోటిలోని సబ్‌జైలులో ఉన్న వారిని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. బోయపల్లె సంఘటనలో ఇద్దరు, ముగ్గురు భాగస్వాములైతే 16 మందిపై 307 సెక్షన్లు పెట్టడం దారుణమన్నారు. మాజీ మండలాధ్యక్షుడు పోలు సుబ్బారెడ్డికి చెందిన కారు, ఇల్లు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్లుగా కూర్చున్నారన్న నెపంతో ఎలాంటి సంబంధం లేని వారిని ఈ కేసులో ఇరికించారన్నారు. బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

సంయమనం పాటించాలి


అప్పారావుపల్లెలో టీడీపీ వర్గీయులు దాడి చేసిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని అప్పారావుపల్లె వైఎస్సార్‌సీపీ నేత కుంచం శ్రీనివాసులరెడ్డి ఇంటి తలుపులు, మంచి నీటి పైప్ లైన్ తదితర సామగ్రి టీడీపీ వర్గీయులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం అప్పారావుపల్లెకు వెళ్లి ధ్వంసం చేసిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. మీరంతా సంయమనం పాటించాలని, ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని చెప్పారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లి ఈ దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుందామని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోవద్దని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ప్రమాదానికి కారణమైన కారు


చిన్నమండెం : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటరమణ

చిన్నమండెం/సుండుపల్లె : చిన్నమండెం, సుండుపల్లె మండలాల పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.మండల పరిధిలోని వండాడి దళితవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వండాడి వెంకటరమణ అలియాస్ కళ్యాణ్(38) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. వండాడి గ్రామం దళితవాడకు చెందిన వెంకటరమణ రాయచోటిలో నంది బోర్‌వెల్స్‌లో పనిచేసేవాడు. విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. తూర్పుపల్లి దళితవాడ దగ్గరకు రాగానే మదనపల్లె వైపు నుంచి వస్తున్న ఏపీ39బీజే 6166 నంబరు గల కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని రాయచోటికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో భాకరాపేట వద్ద వెంకటరమణ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సుండుపల్లె మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో పింఛా చర్చివద్ద ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న మోటారు సైకిళ్లు రెండు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ముడుంపాడు గ్రామం, అయ్యవారిపల్లికి చెందిన నాయుడు రామలింగయ్యకు (59) తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అత్తింటివారి వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన అంజద్‌అలీ కుమార్తె సుఫియా (25)ను సత్యసాయిజిల్లా హిందూపురానికి చెందిన ఇనాయతుల్లాతో వివాహం జరిపించారు. వివాహమైన కొద్దిరోజులకే అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువ కావడంతో సుఫియా పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో సోమవారం టూటౌన్ పోలీసులకు సుఫియా తండ్రి ఫిర్యాదు చేయడంతో భర్త ఇనాయతుల్లా, అత్త జహీరా, మామ నజీర్, మరిది జహీర్‌లపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతపై కేసు నమోదు

ఓబులవారిపల్లె : మంగంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుంతకల్లు రైల్వేబోర్డు వినియోగదారుల కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్డీఏ కూటమికి చెందిన ఫ్లెక్సీలు తొలగించారని అభియోగం మోపారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి నాయకులతో ఎన్నికల్లో తిరిగిన వ్యక్తులు వారు ఏర్పాటు చేసుకొన్న ఫ్లెక్సీలను తొలగించుకున్నారని తెలిపారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదన్నారు. కానీ ఉన్నత స్థాయి నుంచి ఒత్తిడి మేరకు తనపై కక్షపూరితమైన కేసు నమోదు చేశారని చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ సిబ్బందిపై విచారణ


పీహెచ్‌సీ వైద్యాధికారిణి కీర్తితో చర్చిస్తున్న డీపీఎంఓ, డీఎస్ఎంఓలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని వాల్మీకివీధి అర్బన్ పీహెచ్‌సీ సిబ్బందిపై సోమవారం డీపీఎంఓ రియాజ్‌బేగ్ విచారణ జరిపారు. కొద్దిరోజుల క్రితం విధినిర్వహణ విషయంలో సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎంలు పార్వతిబాయి ఎక్కువగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆశ కార్యకర్త చిట్టెమ్మ ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటనపై డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య ఆదేశాల మేరకు డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డిలు సోమవారం విచారణ చేపట్టారు. ఉదయమే అర్బన్ పీహెచ్‌సీ సెంటర్‌కు చేరుకున్న వారు విధి నిర్వహణ విషయంలో సూపర్‌వైజర్, ఏఎన్ఎంలపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపారు. వారి విధి నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వారితో వేర్వేరుగా మాట్లాడి సంజాయిషీలను నమోదు చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కీర్తితో చర్చించి సంఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నివేదికను తదుపరి చర్యల నిమిత్తం డీఎంఅండ్‌హెచ్‌ఓకు సమర్పించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్ : నూతనంగా కొలువు తీరబోయే ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే కార్యాచరణతో ముందుకు వెళ్లాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబులు కోరారు. సోమవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో సంఘం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలను చేపట్టకుండా పాఠశాలలను వీలీనం చేసిందన్నారు. అలాగే మూడు రకాల సిలబస్‌ను ప్రవేశపెట్టడం ఒకే మాధ్యమంలోనే విద్యను బోధించాలనడం, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర పనులలో భాగస్వాములను చేసిందన్నారు. అలాగే అనవసరమైన యాప్‌లతో వేధిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లిందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన న్యాయబద్ధమైన సమస్యలను కూడా పరిష్కరించకుండా ప్రతి దాడులకు పూనుకుని కేసులు పెట్టడం పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం చేశారన్నారు. ప్రస్తుతం అధికారం చేపడుతున్న కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మెగా డీఎస్సీ విడుదల చేస్తూ తొలి సంతకం చేయాలన్నారు. అలాగే జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎజాస్‌అహమ్మద్, చెన్నయ్య, చంద్ర ఓబుల్‌రెడ్డి, ఆడిట్ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రూతు ఆరోగ్యమేరీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బడుగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ శేఖర్‌తో జిల్లా మాలమహానాడు నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు అండగా నిలబడుతూ వారి సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు వ్యవస్థాపకుడు జాకట విజయ శేఖర్ పేర్కొన్నారు. సోమవారం మాల మహానాడు నగర అధ్యక్షుడు చెంచుల డేవిడ్ సత్యరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుందని ఆకాంక్షించారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల మహానాడు నాయకులు కానాల క్లెమెంట్ రాజు, చెంచుల ఎబినేజర్, వజ్రా శ్యామ్, తేజ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి అన్న సత్రానికి రూ.35,816 ఆదాయం


వీరభద్రస్వామి అన్నసత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

చాపాడు : మండలంలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని వీరభద్రస్వామి అన్న సత్రానికి సోమవారం రూ.35,816 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈఓ మాట్లాడుతూ.. ఆలయ పరిధిలోని వీరభద్రస్వామి అన్నసత్రం మూడు రోజుల క్రితం దేవదాయ శాఖ స్వాధీనంలోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించామన్నారు. 500 మంది భక్తులు హాజరుకాగా వీరి ద్వారా వీరభద్రస్వామి అన్న సత్రానికి రూ.35,816 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వీరారెడ్డి, మాజీ ఎంపీపీలు గురివిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, టీడీపీ నాయకులు గోసుల కృష్ణారెడ్డి, మార్తల నరసింహారెడ్డి, నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన అశ్విని(23) కుటుంబ సమస్యలతో ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అదేవిధంగా మదనపల్లె పట్టణంలోని శేష్‌మహల్ ప్రాంతంలో నివాసం ఉన్న మైనర్ బాలిక(16) వంట సక్రమంగా చేయడం లేదని నానమ్మ మందలించడంతో మనస్తాపం చెంది విషద్రావణం తాగింది. పట్టణంలోని సొసైటీ కాలనీలోని ఎస్వీ కాలనీలో నివాసం ఉన్న ప్రతాప్ భార్య సి.సరస్వతి(45) మానసిక, కుటుంబ సమస్యలతో బెంగళూరు నుంచి మదనపల్లెకు వస్తూ, బస్సులో నిద్రమాత్రలు మింగింది. ఆయా ఘటనల్లో బాధితులను వారి కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.